క్లుప్తంగా

సోంపురంలో పారిశుధ్య పనులు



సోంపురం ప్రధాన రహదారిలో జేసీబీతో తొలగిస్తున్న చెత్త

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో మంగళవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామ సర్పంచ్ మురిపిండి గంగ రాజు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ నేతృత్వంలో ఎస్.డబ్ల్యూ.పి.సి కేంద్రం పరిసరాల్లో చెత్త చెదారాలను తొలగించటం, తడి, పొడి చెత్త వేరు చేయటంతో గ్రామంలో పలు వీధుల్లో పూడికతీతలు చేపట్టారు. రోడ్డుకు ఇరుపైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి చెత్తచెదారాలను ట్రాక్టర్‌తో తరలించారు. గ్రామస్తులు సహకరించి సీజనల్ వ్యాధులు బారిపడకుండా పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని గృహాల్లో వాడే తడి చెత్త పొడి చెత్త వేర్వేరుగా గ్రామ అంబాసిడర్లకు అందజేయాలని కోరారు.

వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో రోగులను తనిఖీ చేస్తున్న వైద్యులు

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని బెల్లాన ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆసుపత్రి ఎండీ బెల్లాన లక్ష్మీ నరేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిబిరంలో కార్డియాలజిస్ట్, జనరల్ మెడిసిన్, గైనకాలజిస్ట్, న్యూరాలజిస్ట్, ఈఎన్‌టీ విభాగాలకు చెందిన వైద్యులు శరత్‌పాత్రో, ప్రవర్తన, పద్మావతి, బాలప్రదీప్, సతీష్‌రెడ్డి పాల్గొని 125 మందికి పైగా రోగులకు సేవలు అందించారు. పది మంది రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయించేందుకు ఎంపిక చేసినట్టు ఆమె తెలిపారు.

పాఠశాల సందర్శన



విద్యాభ్యాసనను పరిశీలిస్తున్న ఎంఈవో

వేపాడ: మండలంలోని ఆకులసీతంపేట ప్రాథమిక పాఠశాలను ఎంఈవో బాలభాస్కరరావు మంగళవారం సందర్శించారు. కిచెన్ గార్డెన్‌లో సాగు చేస్తున్న కూరగాయలు పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ మెనూ అమలు పరిశీలించారు. విద్యార్థులచే పాఠాలు చదవించి గణితం చేయించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎండీఎం నిర్వహణలో రుచి, నాణ్యత, పరిశుభ్రత పాటించాలని సూచించారు.

చీపురుపల్లిలో భారీ వర్షం



చీపురుపల్లిలో కురుస్తున్న వర్షం

చీపురుపల్లి: పట్టణంలో మంగళవారం రాత్రి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటల సమయంలో ఈదురు గాలులు ప్రారంభమైనప్పటికీ వెంటనే నిలిచిపోయాయి. అదే సమయంలో వర్షం కురుస్తుందని ఎదురు చూసిన స్థానికులకు నిరాశ మిగిలింది. అయితే రాత్రి 7.15 గంటల తరువాత ఒక్కసారిగా భారీ వర్షం ప్రారంభమై దాదాపు గంట వరకు కురవడంతో వాతావరణం చల్లబడింది.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన కల్పించండి

విజయనగరం ఫోర్ట్: పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అలాగే ఆ పథకం విస్తృత స్థాయిలో అమలు జరగాలని ఏపీఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్, సోలార్ ఎనర్జీ అధికారిణి బి.సులేఖరాణి అన్నారు. మండల పరిధిలోని దాసన్నపేటలోని విద్యుత్ భవన్‌లో సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.లక్ష్మణరావు నేతృత్వంలో విద్యుత్ శాఖ, బ్యాంకు అధికారులతో మంగళవారం జరిగిన సమన్వయ సమావేశానికి ఆమె హాజరై, మాట్లాడారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు బ్యాంకర్లు, సోలార్ వెండర్లు, విద్యుత్ శాఖ అధికారులను సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సోలార్ విద్యుత్ వినియోగానికి ఆసక్తి కనబరిచే వారికి సబ్సిడీపై అందించే పరికరాలు, రుణాలు, సాంకేతిక సాయం వంటి అంశాలపై చర్చించారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు అవసరమైన బ్యాంకు రుణ సదుపాయాలు పర్యవేక్షణకు ఎస్‌బీఐ తరఫున జిల్లా పరిధిలో ఓ నోడల్ అధికారిని నియమించడం జరిగిందన్నారు. సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రమణమూర్తి, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఎం.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమి హామీలు నెరవేర్చే వరకు పోరాటం

- వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశంలో కడుబండి



కొత్తవలస సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజల తరఫున బాధ్యత గల ప్రతిపక్షంగా పోరాడుదామని మాజీ ఎమ్మెల్యే, ఎస్.కోట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కడుబండి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కొత్తవలస మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఇంటింటికి వంచన కార్యక్రమం నిర్వహణకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంగా ప్రజల కష్టాలు, నష్టాలు తెలుసుకుంటూ వారి వెంట నిలబడదామని అన్నారు. గత ఎన్నికల్లో ఆచరణ సాధ్యం కాని బూటకపు హామీలిచ్చి ప్రజలను మోసం చేసి కుట్రలు పన్ని కూటమి గెలిచిందన్నారు. కూటమి నేతలు ఇచ్చిన బాండ్లు చూసి ప్రజలు మోసపోయారని పేర్కొన్నారు. ఏడాది పాలనలో పింఛన్లు మాత్రమే ఇచ్చారని, ఇటీవల ఇచ్చిన తల్లికి వందనం ఒక తల్లికి అందితే ముగ్గురు తల్లులకు అందలేదన్నారు. ఒక ఇంట్లో ముగ్గురు పిల్లలుంటే ఒక్కరికే నగదు జమ చేశారని పేర్కొన్నారు. మన పార్టీ నిర్వహించిన వెన్నుపోటు కార్యక్రమాన్ని చూసి వణుకుపుట్టిన కూటమి పాలకుల్లో కదలిక వచ్చిందన్నారు. నేడు జగన్ పర్యటనలకు వస్తున్న ప్రజలను చూసి కూటమి పాలకుల వెన్నులో వణుకు పుడుతోందన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా అరాచక పాలన సాగిస్తున్నారన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు పోలీసు యంత్రాంగాన్ని వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఈ క్రమంలో ప్రతి మండలంలో రెండు వారాల పాటు ప్రతి గ్రామాన, ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం ప్రజలను ఎలా వంచించిందో గణాంకాలతో సహా వివరించాలన్నారు. అందుకు ప్రతి గ్రామానికి ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు నాయకత్వంలో మనకు ఎటువంటి ఇబ్బందుల్లేవని, పోరాట స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, జెడ్పీటీసీ ఎన్.శ్రీదేవి, ఎంపీపీ ఎన్.గోపమ్మ, వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, సర్పంచ్ మత్స ఎర్రయ్య, రామస్వామి, అప్పలరమణ, పీతల కృష్ణ, పవన్, కోన దేముడు, గేదెల త్రినాథ్, వి.కొండలరావు, గణేష్, లెంక వరహాలు, టి.సోమునాయుడు, ఐతంశెట్టి శ్రీనివాస్, లెంక రామన్నపాత్రుడు, బి.సురేష్, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

ఓటరు నమోదు బాధ్యతగా గుర్తించండి



బీఎల్‌వోల శిక్షణలో మాట్లాడుతున్న ఏఈఆర్‌వో శ్రీనివాసరావు

శృంగవరపుకోట: ఓటర్ల నమోదు ప్రక్రియను గురుతర బాధ్యతగా గుర్తించాలని బీఎల్‌వోలకు ఎస్.కోట తహసీల్దార్ డి.శ్రీనివాసరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ సూచనలతో నిర్వహిస్తున్న బీఎల్‌వోల శిక్షణ కార్యక్రమానికి ఆయన మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకపాత్ర ఎన్నికలదేనని అన్నారు. దీన్ని గుర్తించి ఓటరు నమోదు చాలా ప్రాధాన్యత కలదని పేర్కొన్నారు. ఎన్నికల డీటీ ఎస్.శ్రీనివాసరావు శిక్షణ ప్రాధాన్యతను, శిక్షణ ఉద్దేశాన్ని వివరించారు. కొత్తవలస డిప్యూటీ తహసీల్దార్ పి.సునీతతో పాటు బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామ సత్య కల్యాణ మండపంలో బుధవారం మధ్యాహ్నం 3గంటలకు వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నం నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాలకు వితరణ

వేపాడ: మండలంలో వల్లంపూడి ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన శ్రీసీతారామ యువజన సేవా సంఘం సభ్యులు ఫ్యాన్‌తో పాటు విద్యార్థులకు అవసరమైన సామగ్రిని వితరణగా మంగళవారం అందజేశారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. దాతలకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

జన సురక్ష యోజనతో భరోసా

వేపాడ: ప్రధానమంత్రి సురక్ష యోజన పథకంలో చేరటం వల్ల కుటుంబానికి భరోసా ఏర్పడుతుందని ఏపీ గ్రామీణ బ్యాంకు వేపాడ శాఖ ఫీల్డ్ ఆఫీసర్ అరుణ్ గోపాల్ అన్నారు. నీలకంఠరాజపురం గ్రామంలో సీఎస్‌పీ శారద నేతృత్వంలో మంగళవారం నిర్వహించిన సురక్ష యోజన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు సురక్ష పథకంలో చేరాలన్నారు. బ్యాంకులో బంగారంపై రుణాలు తక్కువ వడ్డీకి అందిస్తున్నామని, ఖరీఫ్ పంట రుణాలు ఇస్తున్నామని, ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది మహేష్, సీఎస్‌పీలు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

చీపురుపల్లి: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ ఎల్.దామోదర రావు అన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంకల్పం సంకల్ప రథం ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలు వినియోగం ద్వారా ఏర్పడే నష్టాల లఘు చిత్రాలను, వీడియోలను ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగం ద్వారా విద్యార్థుల భవిష్యత్ నాశనమవుతుందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంతో ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న యువత నాశనమైపోతారని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోను మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని చెప్పారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని సూచించారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పీహెచ్ కార్మికులు

విజయనగరం గంటస్తంభం: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పీహెచ్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసనకు దిగారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు..ఇంజినీరింగ్, నాన్ పీహెచ్ కార్మికులకు కనీసం వేతనం కింద రూ.21 వేలు, టెక్నికల్ వేతనం రూ.24,500, థర్డ్ పార్టీ కార్మికులకు ఆప్కాస్ జీతాలు చెల్లించాలని, అది కూడా ప్రతినెలా పదో తేదీ లోపు ఇవ్వాలని, సమ్మె ఒప్పంద జీవోలు ఇవ్వాలని, ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. యూనియన్ నాయకుడు ఎ.జగన్మోహనరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి జరుగుతుందని ఆశించామని, ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాల పెంపు లేకుంటే ఎలా బతకాలన్నారు. థర్డ్ పార్టీ కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ కార్మికుని వాటాతో సమానంగా యాజమాన్యం వాటా చెల్లించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ఎలక్ట్రికల్ స్ట్రీట్ లైట్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీసం ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం లేదన్నారు. నగరపాలక సంస్థ టెండర్లలో థర్డ్ పార్టీ కార్మికులకు ఆప్కాస్ జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.రాజు, ఎస్.రామునాయుడు, కె.ఆదినారాయణ, ఉత్తరనాయుడు, రాంబాబు, గౌరీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: ప్రతి మహిళ తమ స్మార్ట్‌ఫోన్‌లో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఏఎస్పీ సౌమ్యలత సూచించారు. నగరంలోని అపెక్స్ విద్యార్థులకు శక్తి యాప్ వినియోగం, దాని ప్రయోజనాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఎవరైనా ఆపద సమయంలో ఉన్నప్పుడు తక్షణ రక్షణ కోసం ఈ శక్తి యాప్‌ను ఆశ్రయిస్తే క్షణాల్లో పోలీసులు వచ్చి రక్షణ కల్పిస్తారని ఆమె తెలిపారు. యువత అంతా ఫ్యాషన్ మాయలో పడి చెడు అలవాట్లకు బానిసలై తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి గూర్చి ఏదైనా సమాచారం తెలిస్తే 100 లేదా 112 నంబర్‌కు గానీ 1972కు గానీ డయల్ చేసి విషయం తెలియజేయాలన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో జూనియర్ లెక్చరర్ ఇన్ కెమిస్ట్రీ పోస్టుకు అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో సెకెండ్ క్లాస్‌లో ఉత్తీర్ణతతో పాటు 50 శాతం మార్కులు కలిగి వున్న అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 17వ తేదీన సాయంత్రం 5గంటల్లోగా మండలంలోని సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందజేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 18వ తేదీన ఉదయం 11 గంటలకు విజయనగరం పట్టణంలో వున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. గతంలో లెక్చరర్‌గా పనిచేసి పదవి విరమణ పొందిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు.

నేటి వైఎస్సార్‌సీపీ సమావేశానికి సర్వం సిద్ధం

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వే గేట్ సమీపంలో బుధవారం జరగనున్న వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశానికి సర్వం సిద్ధమైనట్టు మండల పార్టీ అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున మంగళవారం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరు కానున్నట్టు తెలిపారు. సమావేశానికి అన్ని గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం రేపు

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఆవరణలో మండల విస్తృత స్థాయి సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు తెలిపారు. విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడారు. సమావేశానికి మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు అంతా హాజరు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో కొలువైన ఆంజనేయస్వామికి మంగళవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వేకువజామున ప్రాతఃకాలార్చన, బాలభోగం అనంతరం ఆంజనేయునికి పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం చేశారు. ఆ తర్వాత స్వామి వారిని తమలపాకులు, సింధూరంతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే హనుమాన్ చాలీసా పఠనం సాగించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించండి : ఏడీఏ



వేపాడ: సాగులో మెలకువలు చెబుతున్న ఏడీఏ భానులత

వేపాడ: ఖరీఫ్ సీజన్‌లో నారుమడిలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై కొత్తవలస వ్యవసాయ శాఖ ఏడీ ఏ భానులత రైతులకు వివరించారు. బొద్దాం, పాటూరులో మంగళవారం నిర్వహించిన పొలంబడిలో పాల్గొన్న ఆమె ఎద పద్ధతిలో వరిసాగు కలుపు నివారణ యాజమాన్య పద్ధతులు, ఎండకు ఎండిపోయే వరినారును కాపాడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఖరీఫ్‌లో వరి సాగు చేసే రైతాంగం ఎకరాకు 200 చెల్లించి ఇన్సూరెన్స్ కట్టుకుంటే తుఫాన్ ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే పరిహారం పొందవచ్చునన్నారు. ఇన్సురెన్స్ చెల్లించటానికి ఆగస్టు 15 వరకు గడువు వుందన్నారు. కార్యక్రమంలో ఏవో వి.స్వాతి, సుస్థిర వ్యవసాయ కేంద్రం కో ఆర్డినేటర్ వెంకటరావు, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ ఈశ్వర్రావు, పలువురు రైతులు పాల్గొన్నారు.



గజపతినగరం: రైతులకు సూచనలిస్తున్న ఏవో కిరణ్‌కుమార్

పొలం పిలుస్తోంది..

గజపతినగరం: ఖరీఫ్ వరి పంటలు సాగు చేసేటప్పుడు వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన యాజమాన్యం పద్ధతులను పాటించాలని ఏవో పి.కిరణ్‌కుమార్ అన్నారు. మండలం శ్రీరంగరాజపురం, వేమలి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు.

మధ్యవర్తిత్వం మంచి మార్గం



ఎస్.కోటలో న్యాయమూర్తి కనకలక్ష్మితో కలిసి ర్యాలీలో పాల్గొన్న న్యాయవాదులు

- న్యాయమూర్తితో కలిసి లాయర్ల ర్యాలీ

శృంగవరపుకోట: 'మధ్యవర్తిత్వం – దేశం కోసం' అన్న కార్యక్రమాన్ని ప్రజలకు వివరించేందుకు ఎస్.కోట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయసేవా కమిటీ చైర్మన్ బి.కనకలక్ష్మి న్యాయవాదులతో కలిసి స్థానిక దేవీ జంక్షన్‌లో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 'మధ్యవర్తిత్వం – దేశం కోసం', మధ్యవర్తిత్వం – మంచి మార్గం' అంటూ నినదించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కనకలక్ష్మి మాట్లాడుతూ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఇందుకు అందరూ ముందుకు రావాలనేది ప్రభుత్వ యోచన అన్నారు. ఇందుకుగాను ప్రజలను, వ్యవస్థలను సమాయత్తం చేసేందుకు దేశవ్యాప్తంగా 90 రోజులు కార్యక్రమాలు చేయాలని న్యాయ మంత్రిత్వ శాఖ ఆదేశించినట్టు వెల్లడించారు. ఇందులో భాగంగా మండల న్యాయసేవాధికార సంస్థ నేతృత్వంలో ఈ నెల 10 నుంచి 16 వరకు ప్రచార కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. మంచి వ్యక్తుల మధ్యవర్తిత్వంతో రాజీ అయిన కేసులకు కూడా కోర్టు చట్టబద్ధత కల్పిస్తుందన్నారు. రాజీతో సమయం, డబ్బు ఆదా అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్.కోట బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.సూరిదేముడు, బి.వి.ఎస్.రామారావు, న్యాయవాదులు బి.వెంకటరావు, బి.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య తనిఖీలు



కళ్లను తనిఖీ చేస్తున్న వైద్యురాలు

విజయనగరం: స్థానిక మున్సిపల్ మాజీ చైర్మన్ స్వర్గీయ అవనాపు సూరిబాబు జయంతి సందర్భంగా నగరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. విజయనగరానికి చెందిన నాగవంశ సంక్షేమ సంఘం, స్వామి కంటి ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరానికి మొత్తం 476 మందికి కంటి రోగులు హాజరు కాగా వారి కళ్లను వైద్యులు తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. నేత్ర వైద్య తనిఖీలకు హాజరైన వారిలో 142 మందికి నేత్ర శస్త్ర చికిత్స అవసరమని గుర్తించినట్లు నాగవంశ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అవనాపు విక్రమ్ తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు మంచు రవళి తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ప్రేమ సమాజంలోని వృద్ధులకు అన్నదానం, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అంతకుముందు సూరిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కాళ్ళ గౌరీశంకర్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.